ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు

3★

మంగళవారం 21 మే 2024



వెలవెలబోతున్న గోదావరి

● మరమ్మతుల కోసం సుందిళ్ల బ్యారేజీ ఖాళీ

4లో..

5లో..

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

'ఉపాధి' పనుల జోరు





చెరువుల్లో పూడిక తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

- జిల్లాలో రోజుకు 20 వేల నుంచి 30 వేల మంది కూలీల హాజరు
- 15.75 లక్షల పని దినాలకు 10.14 లక్షల పనిదినాలు పూర్తి
- 50 రోజుల్లో రికార్డు స్థాయిలో పనులకు వచ్చిన కూలీలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల నుంచి గ్రామాల్లో కూలీలు ఎండలను సైతం లెక్క చేయకుండా కుటుంబ పోషణ కోసం ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో యాభై రోజుల వ్యవధిలో 10 లక్షల 14 వేల మందికి ఉపాధి పనులు కల్పించారు. రోజుకు సరాసరి 20 వేల నుంచి 30 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో, ప్రస్తుత మే నెలలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా 47.0 డిగ్రీల వరకు నమోదు కావడం గమనార్హం. అయినా కూడా పూట గడవాలంటే తప్పనిసరిగా ఉపాధి పనులకు వెళ్లాల్సిందేననే భావిస్తున్న కూలీలు పనులకు వస్తున్నారు. ఉపాధి కూలీ 300 రూపాయలు ఉండగా, చేసిన పనిని బట్టి సరాసరి 210 రూపాయల వరకు వస్తున్నది. జిల్లాలో 1,17,396 కుటుంబాలకు జాబ్ కార్డులను జారీ చేయగా, ఇందులో 2,56,869 మంది కూలీలు నమోదై ఉన్నారు. 73 వేల కుటుంబాలకు చెందిన జాబ్ కార్డులు పరిగణనలో ఉన్నాయి. ఒక లక్షా 17 వేల కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామాల్లోని కూలీలు, వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్లకుండా ఉండేందుకు గాను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని తీసుకు వచ్చింది. ఈ పథకానికి చట్టబద్ధత కూడా కల్పించింది. జాబ్ కార్డు పొందిన ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలనే నిబంధన విధించారు. ఈ పథకానికి కేటాయించే నిధుల్లో 60 శాతం కూలీలకు పనులు కల్పించేందుకు వెచ్చిస్తుండగా, కూలీ పనులపై జనరేట్ అయ్యే 40 శాతం నిధులను మెటీరియల్ కంపొనెంట్ కింద వెచ్చించనున్నారు.

డిమాండ్‌కు తగ్గ పనులు పెంచాలంటున్న కూలీలు..

ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు, గ్రామాల అభివృద్ధికి ఆయువు పట్టుగా మారింది. జిల్లాలో ఎక్కువగా ఉపాధి కూలీలు జనవరి నుంచి జూన్ వరకు పనులకు వస్తున్నారు. వానాకాలంలో 2 లక్షల 80 వేలు, యాసంగిలో 2 లక్షల 15 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి.

వరి నాట్లు వేయడం, కలుపు తీయడం, పత్తి పంట సాగుకు విత్తనాలు వేయడం, మధ్య మధ్యలో కలుపుతీత పనులతో పాటు వరి కోతల సమయంలో, పత్తి ఏరేందుకు కూలీలు వెళుతుంటారు. డిసెంబరు, జనవరి నెలల్లో కూలీలు వరి నాట్లు వేసేందుకు వెళుతున్నారు. ఆ తర్వాత నుంచి ఉపాధి హామీ పనులకే వెళుతున్నారు. వరి కోతలను హార్వెస్టర్ల ద్వారా చేపడుతుండడంతో కూలీలకు వ్యవసాయ పరంగా పనులు దొరకడం లేదు. దీంతో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, ప్రాజెక్టుల కాలువలు, పంట కాలువల్లో పూడిక తీయడం, వెడల్పు చేయడం, పంట పొలాల వద్దకు కొత్తగా రోడ్లు వేయడం, రోడ్ల విస్తరణ, హరిత హారంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, గుట్టల వద్ద వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు కందిత కందకాలు తీయడం, ఫిష్ పాండ్స్ తదితర పనులు చేస్తున్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం జిల్లాకు 15 లక్షల 75 వేల పని దినాలను కేటాయించింది. యాభై రోజుల్లో 10 లక్షల 14 వేల పని దినాలు పూర్తయ్యాయి. ఇంకా 5 లక్షల 61 వేల పని దినాలు ఉన్నాయి. ఒక్క ఏప్రిల్ నెలలోనే రికార్డు స్థాయిలో 8,16,697 కూలీలకు పని దినాలు కల్పించారు. మే నెలలో సోమవారం నాటికి 1,97,018 పని దినాలను కల్పించారు. తొలకరి జల్లులు కురియగానే వ్యవసాయ పనులు ఆరంభం అవుతా యి. జూన్ రెండో వారం వరకు ఉపాధి పనులకు కూలీలు చాలా మందే వచ్చే అవకాశాలున్నాయని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన పనిదినా లు సరిపోయేలా లేవని, మరొక పది లక్షల పని దినాలను పెంచాలని ఉపాధిహామీ కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దుస్తుల కటింగ్ మిషన్ ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, మే 20: మండలంలోని ఆయా గ్రామాల్లో 41 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికల దుస్తుల కటింగ్ మిషన్‌ను మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ మండల సమైక్య అధ్యక్షురాలు టి మౌనిక సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ మండలంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు 1029మంది, బాలికలు 1326మంది చదువుతున్నారన్నారు. వారి స్కూల్ యూనిఫామ్ కట్ చేసి కుట్టించి ఆయా పాఠశాలలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కనుకయ్య, సీసీలు శారద, తిరుమల, నిర్మల, హరికృష్ణ, కనకతార, క్రాంతి మండల సమైక్య ప్రధాన కార్యదర్శి మానస, కోశాధికారి సునీత, సిబ్బంది చంద్రకళ, తాజోద్దీన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

పెద్దపల్లి రూరల్, మే 20: మండలంలోని పెద్దబొంకూర్, దస్తగిరిపల్లి గ్రామాల మధ్య గల రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురికి కాలువ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎంపీటీసీ మిట్టపల్లి వసంత-వెంకటేషంతో పాటు, రైల్వే అధికారులు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా సోమవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు కావునా వాహనదారులు, గ్రామాల ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న మినీ స్టేడియంలో సోమవారం క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే విజయరమణా రావు ప్రారంభించారు. అశోక్‌నగర్‌కు చెందిన రంజిత్ కుమార్ స్మారకార్థం ఆ ప్రాంత యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి వారితో పాటు క్రికెట్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఆటల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మినుపాల ప్రకాశ్ రావు, సింగిల్ విండో అధ్యక్షులు శ్రీగిరి శ్రీనివాస్, పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేగోలం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, చింతల సునితరాజు, రాజయ్య రఫీ తదితర కౌన్సిలర్లు, మెంగని శ్రీనివాస్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ప్రారంభమైన టెట్



అభ్యర్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, మే 20: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్) సోమవారం ప్రారంభమైంది. రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షల్లో 200 మంది విద్యార్థులకు గాను 155 మంది హాజరైయ్యారు. ఉదయం 100 మందికి 84 మంది, సాయంత్రం 100 మందికి 71 మంది పరీక్షలకు హాజర య్యారు. 45 మంది గైర్హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండ్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన సెషన్‌లో ఒక అభ్యర్థి ఆలస్యంగా రావడంతో అనుమతి నిరాకరించారు. పరీక్షను జిల్లా విద్యాధికారి మాధవి పర్యవేక్షించారు. టెట్ పరీక్షలు జూన్ 2 వరకు జరుగుతాయని డీఈవో తెలిపారు.

ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కాల్వశ్రీరాంపూర్, మే 20: మండలంలోని మల్యాల గ్రామపరిధిలో గల మోడల్ స్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో 160 సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ అన్నారు. ఎలాంటి పరీక్ష ఫీజు లేకుండా ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా పాఠశాలకు కానీ దరఖాస్తులు ఈ నెల 25 లోపు ఇవ్వాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రైవేట్ హాస్పిటల్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ డీఎంహెచ్‌వో కృపాభాయి

కోల్‌సిటీ, మే 20: గోదావరిఖనిలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను సోమవారం అసిస్టెంట్ డీఎంహెచ్‌వో కృపాభాయి ఆధ్వర్యంలో ఎనిమిది ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న సౌకర్యాలు, రిజిస్ట్రేషన్ ఉన్నాయా లేదా, బయో మేనేజ్‌మెంట్, పొల్యూషన్ సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లు రెన్యువల్ చేసుకోని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. పని చేస్తున్న డాక్టర్ల సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మెడికల్ ఆఫీసర్లు మాణికేశ్వర్‌రెడ్డి, సరళ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి రూరల్, మే 20: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి నెలలు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్‌కు వినతిపత్రం అందించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఏ గ్రేడ్ రకాన్ని సహకార సంఘం, రైస్ మిల్లర్లు కుమ్మక్కై బి గ్రేడ్‌తో కొనుగోలు చేస్తున్నారని వినతితో పేర్కొన్నారు. దీంతో రైతు క్వింటాల్ కు రూ.20 నష్టపోతున్నారని దీనిపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు సంతోష్, కావేటి రాజగోపాల్, వేల్పుల రమేష్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో

కేవీకే శాస్త్రవేత్తలది కీలకపాత్ర

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, మే 20: కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. భారతదేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిల్లాలో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సోమవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్‌ను సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలుసుకొని స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన టార్చ్‌ను అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో డాక్టర్ మోహన్ సింగ్ మెహత కమిటీ సిఫారసు మేరకు మొట్ట మొదటగా కృషి విజ్ఞాన కేంద్రంను పాండిచ్చేరి 1974 మర్చి 21న స్థాపించారన్నారు. మన దేశంలో ఇప్పటి వరకు 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రాలు ముఖ్యంగా రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాని పెంపొందించడమే కాకుండా జిల్లాలోని రైతుల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. రైతులకు నూతన వంగడాలను పండించి అందించడమే కాకుండా క్షేత్ర పరిశీలనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, పత్రిక మాధ్యమాల ద్వారా సలహాలు, సూచనలు అందించడం ద్వారా రైతులకు సేవ చేస్తున్నారన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు నేర్పుతారని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న స్వర్ణోత్సవాల సందర్భంగా శాస్త్రవేత్తల బృందాన్ని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఖిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం డాక్టర్ వై వెంకన్న, బి భాస్కర రావు , డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ కిరణ్ పెళ్లి, బి నవ్య, డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శాస్త్రవేత్తలు



ర్యాలీలో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్తలు

● కృషి విజ్ఞాన కేంద్రంతో రైతులకు నూతన సాంకేతికత

రామగిరి: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు నూతన సాంకేతిక విప్లవానికి మార్గదర్శనం అయ్యిందని కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా రైతులతో కేంద్రాల స్వర్ణోత్సవ ర్యాలీలో చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలను కృషి విజ్ఞానం కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సాంకేతికను అందుబాటులో తీసుకురావడంతో పాటు ప్రతీ సంవత్సరం భూసార పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ సీజన్‌లో రైతులు వేయాల్సిన పంటలు దిగుబడుల అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. నూతన సాంకేతికతల పైన వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిగలిగామన్నారు. గృహ, శాస్త్ర, పశుసంబంధించిన అనేక అంశాలపై రైతులకు అవగాహన కల్పించిన ఘనత కేవీకే కళాశాలకే దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకన్న, భాస్కర్‌రావు, వినోద్‌కుమార్, కిరణ్, నవ్య, అర్చన, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి - పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే



మాట్లాడుతున్న శ్రీనివాస్ గొమాసే

జ్యోతినగర్, మే 20: రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే ఆరోపించారు. సోమవారం ఎన్టీపీసీ టీపీటీఎస్‌లో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజాపాలన చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజావ్యతిరేక పాలన చేస్తోంద న్నారు. రైతులకు మేలు చేస్తామని, గిట్టుబాటు ధరతోపాటు 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతుల ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనడంలో తీవ్ర జాప్యం చేశారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని శ్రీనివాస్ అన్నారు. తక్షణం తడిసిన ధాన్యాన్ని కొనాలని, 500 రూపాయల బోనస్, గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలు రైతుల విషయంలో మాత్రం స్పందించడం లేదని, మంత్రిగా శ్రీధర్‌బాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. మరోసారి కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారని స్పష్టం చేశారు. బీజేపీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, మరోసారి అధికారంలోకి వస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని, ఎన్నికలలో తనకు ఓటు వేసిన ఓటర్లు, తన గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు బల్మూరి అమరేందర్‌రావు, సోమారపు లావణ్య, గుండెబోయిన లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్న మోదీ

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకన్న

కళ్యాణ్‌నగర్, మే 20: మోదీ హయాంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకన్న అన్నారు. సోమవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పరిపాలనలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేశారని, కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చి బడా కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారని ఆయన ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు, యాజమాన్యాలు విఫలమయ్యాయని, హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు చట్టబద్ధ హక్కులను కూడా కల్పించడం లేదన్నారు. ప్రతి నెల కార్మికులకు వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సోలార్, సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలు స్పందించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈదునూరి నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఐ కృష్ణ, అశోక్, శంకర్, మొగిలి, దుర్గయ్య, రాంకీ, బుచ్చమ్మ, వెంకటస్వామి, కాంతయ్య, పద్మ, రాజేశం, రవికుమార్, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

విద్యుత్ తీగలు తెగిపడి రెండు గేదెలు మృతి

సుల్తానాబాద్, మే 20: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం రెండు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒజ్జ సదయ్య అనే రైతుతో పాటు దూడం రాములు అనే రైతుకు చెందిన పాడి గేదెలు మేతకు వెళుతుండగా మార్గమధ్యలో తెగిపడిన విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని రైతులు తెలిపారు. తమకు తగిన నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వెలవెలబోతున్న గోదావరి

● మరమ్మతుల కోసం సుందిళ్ల బ్యారేజీ ఖాళీ

కోల్‌సిటీ, మే 20: గలగల పారే గోదావరి వెలవెలబోతోంది.ఐదేళ్లుగా నిండుకుండలా ఉన్న గోదావరిలో ఇప్పుడు మడుగులు దర్శనమిస్తున్నాయి. రెండేళ్ల భారీ వరదలకు ఉన్న ఇసుక కొట్టుకపోయి రాళ్లు తేలాయి... అక్కడక్కడ లోతైన గుంతల్లో మాత్రమే నీరు మిగిలింది. మరమ్మతుల కోసం ఈ నెల 18న సుందిళ్ల బ్యారేజీలో నుంచి 0.7 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. ప్రీ మాన్‌సూన్ ఆపరేషన్స్ మెయింటనెన్స్ పనులు నిర్వహించనున్నారు. ఇందు కోసం బ్యారేజీలోని నీటిని దిగువకు వదిలారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన గోదావరిలో ప్రవాహం లేదు. ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీరే ప్రస్తుతం గోదావరిలో కలుస్తుంది. గోదావరిలో ఏర్పడిన మడుగుల్లోని నీటిలోనే భక్తులు పుణ్య స్నానాలు చేస్తున్నారు. గోదావరి ఖని పుష్కర ఘాట్ నుంచి ఇసుకలో నడిచి వెళ్లి పుణ్యస్నానాలు చేయడం పరిస్థితి ఏర్పడింది.

● సింగరేణికి గోదావరే దిక్కు...

గోదావరిలో నీరు తగ్గిపోవడంతో దీని ప్రభావం సింగరేణి మంచినీటి సరఫరాపై పడనున్నది. గోదావరినదిలోని ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ ద్వారా సింగరేణి కాలనీల అవసరాలకు ప్రతి రోజూ 23 నుంచి 25 ఎంఎల్‌డీల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సాండ్ బెడ్‌లో ఉన్న నీటినే సింగరేణి వాడుకోవాల్సి వస్తోంది. మరో పది రోజుల్లో వర్షాలు కురవక పోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.



గోదావరిలో తగ్గిన నీరు

తప్పుడు డాక్యుమెంట్స్‌తో భూమి అమ్మకం : ఇద్దరి అరెస్టు

చొప్పదండి, మే 20: చొప్పదండి పట్టణంలోని సర్వే నంబరు 301లో తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని అమ్మిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. 301 సర్వే నంబర్‌లో గుర్రం రాంరెడ్డి అనే వ్యక్తికి 65 గుంటల భూమి ఉంది. ఈ భూమిని రాంరెడ్డి 2010లో మునిపట్ల దేవేందర్‌రెడ్డి, అన్నాడి శ్రీకాంత్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశాడు. తన వాటాగా వచ్చిన 32 గుంటల భూమిని మునిపట్ల దేవేందర్‌రెడ్డి చొప్పదండికి చెందిన కొత్తూరు ఆంజనేయులు, సుద్దాల వెంకటస్వామికి 2019 సంవత్సరంలో విక్రయ ఒప్పందం, జీపీఏ చేశాడు. అదే భూమిలోని ఆరు గుంట భూమిని సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు ఆంజనేయులు ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన చిలుక బాలామణి, కళ్లెం అంజిరెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం అదే భూమిని పాత జీపీఏ డాక్యుమెంట్లు చూపించి కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్ రెడ్డి వద్ద ఎనిమిది లక్షల రూపాయలు తీసుకుని అమ్మారు. రిజిస్ట్రేషన్ చేసి మోకా ఇప్పిస్తామని చాలా రోజుల నుంచి తప్పించుకుంటున్నారు. భూమి చూపెట్టమని అడిగితే అంతు చూస్తామని బెదిరించారు. దీంతో వైద్యుల మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం సోమవారం సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు ఆంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

రామడుగు, మే 20: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఊర చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఊర చెరువులో రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించడంతో సమీప బావులలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే నిర్మాణ పనులకు చెరువులోని మట్టిని తీయడానికి అనుమతులు తీసుకున్నట్లు సదరు కాంట్రాక్టర్ బెదిరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా మట్టి తరలిస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ మట్టి తరలింపును నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

బీపీఎంపై కేసు నమోదు

గొల్లపల్లి, మే 20: మండలంలోని చిల్వాకోడూర్ తపాల శాఖలో ఖాతాదారులకు సంబంధించిన 11.60 లక్షల రూపాయలు స్వాహా చేసిన బీపీఎం దూడ నల్ల పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సోమవారం తెలిపారు. చిల్వాకోడూర్ బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న నల్ల పోచయ్య తపాల శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఖాతాదారులు తమ డబ్బులను పొదుపు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు తపాల శాఖలో పొదుపు చేసుకుంటున్నారు. బీపీఎం ఖాతాదారుల నుంచి తీసుకున్న సొమ్మును వారి వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు ఇటీవల వెలుగు చూసింది. బాధితులు గొల్లపల్లిలోని తపాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయగా, విచారించిన అధికారులు ఖాతాదారుల డబ్బును స్వాహా చేసినట్లు తేలింది జగిత్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ జి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీపీఎం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం : ఒకరి అరెస్టు

ఇల్లంతకుంట, మే 20: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకులను మోసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన కారు నాథం శివకృష్ణను సోమవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య ఇదే గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బోల్ల రాము, తిప్పరవేని చంద్రశేఖర్, దారం శ్రీనివాస్‌రెడ్డికి శివకృష్ణను పరిచయం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి ఉద్యోగాలు ఇప్పిస్తానని శివకృష్ణ వారివద్ద నుంచి 6.50 లక్షల రూపాయలు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సోమవారం ఇల్లంతకుంట బస్టాండులో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటే యువకులు నమ్మిమోసపోవద్దని ఆయన అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన సందవేణి రేణుక (23) కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి ఆదివారం రాత్రి తిరిగి ఆటోలో బయలుదేరింది. కొలనూరు గ్రామంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రేణుక సోదరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ఇసుక లారీ

రామగిరి, మే 20: మండలంలోని నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో అదుపు తప్పిన ఇసుక లారీ కారును ఢీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో సోమవారం ఓ లారీ వేగంగా వస్తూ అదుపు తప్పింది. బ్యాంక్ ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు అన్నారు.

జేఎన్టీయూ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్

ఉత్తర్వులు జారీచేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకువచ్చారు.

మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

గంభీరావుపేటలో సైబర్ మోసం

● రైతుల బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3 లక్షల 24 వేలు స్వాహా ● వాట్సాప్‌లో ఫేక్ లింక్ మెసేజ్‌లు

గంభీరావుపేట, మే 20: గంభీరావుపేట మండలంలో పలువురు సైబర్ మోసానికి బలయ్యారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో ఫేక్ లింక్‌ల మెసేజ్‌లు పంపుతూ బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు స్వాహా చేస్తున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో రూ. 3 లక్షల 24 వేల 900 వేలు సైబర్ నేరగాళ్లు కొట్టేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. మోసపోయిన నలుగురు బాధితులు రైతులే కావడం గమనార్హం. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి నుంచి రూ. 45 వేలు, దండు నరేష్ ఖాతా నుండి రూ. 44 వేల 900, లంగారెడ్డిగారి రాజశేఖర్‌రెడ్డి ఖాతా నుండి 50 వేలు, కోటయ్యగారి లత ఖాతా నుంచి రూ 1 లక్షా 85 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. రైతులు వరి ధాన్యం అమ్మిన డబ్బులు ఇటీవల యూనియన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. డబ్బులు జమ అయిన కొద్ది రోజుల్లోనే వీరి ఖాతాల నుంచి డబ్బులు పోయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నలుగురు బాధితులు బ్యాంక్ వద్దకు పరుగులు తీశారు. ఫేక్ లింక్‌ల మెసేజ్‌ను ఓపెన్ చేయడం వల్లే బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు లూటీ అయినట్టు బ్యాంక్ అధికారులు బాధితులకు చెప్పారు. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితులు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే పేరిట పంపిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడం వల్లే డబ్బులు స్వాహా అయ్యాయని పోలీస్‌లు గుర్తించారు. ఆ ఫేక్


డబ్బులు పోయాయని ఆవేదనతో ఉన్న రైతులు

లింక్ క్లిక్ చేసిన వెంటనే సెల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి, ఓటీపీ ద్వారా డబ్బులను కొట్టేస్తున్నట్టు పోలీస్‌లు నిర్ధారించారు. ఆరుగాలం శ్రమించిన వరి ధాన్యం డబ్బులు సైబర్ నేరగాళ్ల పరం కావడంతో రైతు కుటుంబాలను తీవ్రంగా బాధించింది. పోయిన మా డబ్బులు తిరిగి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఫేక్ లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, పోలీస్‌లు ప్రజలకు సూచించారు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

శంకరపట్నం, మే 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో టిప్పర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసులు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పర్వతం ఎల్లయ్య (51) శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన తన కూతురు ఊర పద్మ ఇంట్లో రెండు నెలలుగా ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకుంటున్నాడు. సోమవారం వ్యక్తిగత పనిపై బయటికి వెళ్లాడు. తాడికల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు రాగానే జాతీయ రహదారి 563 నిర్మాణ సంస్థ బుల్డ్‌కాస్‌కు చెందిన ఓ టిప్పర్ హుజూరాబాద్ వైపు వెళ్తూ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్ ఎల్లయ్యపై నుంచి వెళ్లగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీల్‌రాం పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన 5నిమిషాలకే ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కొడుకు పర్వతం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు రాస్తారోకో చేయగా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేష్‌తో పాటు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, అదనపు సిబ్బంది సంఘటన స్థలానికి చేసుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు.

టిప్పర్లే మృత్యు శకటాలు

● తాడికల్‌లో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతి

శంకరపట్నం : శంకరపట్నం మండలంలో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. కరీంనగర్-వరంగల్ రహదారిపై ఐదు రోజుల వ్యవధిలోనే తాడికల్‌లో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గత బుధవారం ఆయిల్ ట్యాంకర్ ప్రజలపై దూసుకు వచ్చిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో పలు యాక్సిడెంట్లకు కారణమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని రావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్ల అధిక వేగం, భారీ వాహనాలు, ఓవర్‌లోడ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన చర్యలు చేపట్టి ఇక మీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

● రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

సిరిసిల్ల క్రైం మే 20: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జోగినిపల్లి భాస్కర్‌రావు సోమవారం ఏసీబీకి చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశం అదే గ్రామంలో ఖబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. రూ.4.35 లక్షలతో నిర్మించిన ఖబ్రస్థాన్ ప్రహరీ బిల్లు ఫైల్‌ను చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు సీనియర్ అసిస్టెంట్ జోగినిపల్లి భాస్కర్‌రావును కలిశాడు. నాలుగు నెలలుగా తిప్పుకుంటున్న భాస్కర్‌రావు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ వెంకటేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నాలుగు రోజులుగా వలపన్నిన ఏసీబీ అధికారులు సోమవారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో వెంకటేశం నుంచి రూ.7వేలు


బాధితుడు జి. వెంకటేశ్


ఏసీబీకి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు

లంచం తీసుకుంటుండగా భాస్కర్‌రావును పట్టుకున్నారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టర్ వెంకటేశం వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ బిల్లుకు సంబంధించిన ఫైల్స్‌తోపాటు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్‌ను కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఏ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ : 9154388954 సమాచారం అందించాలని, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు కృష్ణకుమార్, తిరుపతి, ఎస్ఐలు పాల్గొన్నారు.

గూడెం వద్ద గోదావరిలో మునిగి యువకుడి మృతి


కీర్తన్‌గౌడ్(ఫైల్)

దండేపల్లి,మే 20: హనుమాన్ మాలధారణ స్వీకరించేందుకు వచ్చిన యువకుడు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషీ (19) అతని స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్మ సాయితో కలిసి హనుమాన్ దీక్ష స్వీకరించేందుకు గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలోని అనుబంధ హనుమాన్ ఆలయానికి వచ్చారు. దీక్షకు ముందు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో దిగారు. కీర్తన్‌గౌడ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో జాలర్లు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కీర్తన్‌గౌడ్ మృతి చెందాడు. మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్‌గౌడ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి దుర్గం తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్ టౌన్, మే 20:ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. వర్షం వల్ల మొలకెత్తిన, తడిసిన ధాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేలా చూడాలన్నారు. ఈ మేరకు రైస్‌మిల్లర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సిరిసిల్ల అదనపు కలెక్టర్లు లక్ష్మికిరణ్, శ్యాంప్రసాద్‌లాల్, రాంబాబు, బీమానాయక్, పౌర సపరఫరాల జిల్లా మేనేజర్ రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డిఆర్‌డిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


గర్రెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కర్ణణ్

సుల్తానాబాద్, మే 20: అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర సంచాలకులు ఆర్ వి కర్ణన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం జిల్లా ప్రత్యేకాధికారి కర్ణన్ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణన్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడారు. వారి నుంచి కొనుగోళ్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులున ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నక్కను రక్షించిన ఫారెస్టు అధికారులు

శంకరపట్నం, మే 20: వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన నక్కను ఫారెస్టు అధికారులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. సోమవారం మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులో ముప్పిడి విజేందర్‌రెడ్డి వ్యవసాయ బావిలో నక్క పడిందని సమాచారం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ తక్షణమే అక్కడికి చేరుకొని బావి నుంచి నక్కను బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు.


బావినుంచి బయటకు తీసిన నక్క

జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, మే 20: బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌లో దీటి శ్రీనివాస్, దీటి మహేష్‌లను హత్యచేసిన కేసులో ఏడుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సోమవారం ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్ట్ చేసి చూపించి హత్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపులాపూర్ గ్రామంలో దీటి తార, ఆమె కొడుకు దీటి శ్రీనివాస్ 2018లో నాగుల అంజయ్య వద్ద ఇంటిని కొన్నారు. అదే ఇంటిని 2017లో అంజయ్య తమకు విక్రయించాడని తార ఇంటి పక్కనే ఉన్న బుర్ర లక్ష్మి ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ కోర్టును ఆశ్రయించారు. 2023లో కోర్టు సివిల్ కేసును కొట్టివేసింది. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నెల 16న రాత్రి తార, కొడుకు శ్రీనివాస్, దీటి మహేష్, నవీన్ కుటుంబ సభ్యులకు గొడవ జరిగింది. దీంతో శ్రీనివాస్‌ను అతడికి సహకరిస్తున్న మహేష్‌ను ఎలాగైనా చంపాలని నవీన్ అనుకున్నాడు. అదే రోజు రాత్రి నవీన్ స్నేహితులు పవన్, రాజేందర్, వెంకటేష్, గంగారాజం అలియాస్ మనోజ్, శేషు, అజయ్‌లతో


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

కలిసి శ్రీనివాస్, మహేష్‌లపై ఇనుప పైపులు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుగ్గారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సంఘటనకు కారణమైన బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజలపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సతీష్, ఉమాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కొండస్వామి ఆలయంలో కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 20: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండ స్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో వేదపండితుడు చక్రపాణి మాధవచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గ్రామ పంచాయతీ నుంచి పుస్తె, మట్టెలను ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ స్థులు డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

ధర్మపురిలో వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 20: నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నకూటోత్సవంలో భాగంగా ఉదయం పలు రకాల ప్రసాదాలతో మహా నివేదన, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహిం చారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తులసీ దండలతో స్వామివారల అలంకరణ

రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీల పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కోల్‌సిటీ, మే 20: గోదావరిఖని గంగానగర్‌లోని మిలీనియం క్వార్టర్స్ సమీపంలో ఆదివారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. టీఎస్03యూడీ0220 నంబర్ గల వాహనంలో 65బస్తాలు, టీఎస్22టీ8686 నంబర్ గల వాహనంలో 50బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి బేగంపేటకు చెందిన పోలుదాసరి సంతోష్, తూర్పాటి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

యారన్ సబ్సిడీ సమస్య పరిష్కరించాలి


సిరిసిల్ల చేనేత జౌళిశాఖ ఎదుట ధర్నా చేస్తున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 20: బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే పదిశాతం యారన్ సబ్సిడీ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల నేతన్నల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను తగ్గించకుండా వెంటనే అందించాలన్నారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన దాదాపు 10 నెలల పెండింగ్ డబ్బులను చెల్లించాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 24వ తేదీన సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క దేవదాస్, గుండురమేష్, కంది మల్లేశం, బెజుగం సురేష్, మూషం శంకర్, స్వర్గం శేఖర్, రవీందర్, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్, రాజమౌళి, శ్రీధర్, నరేష్, దామోదర్, భాస్కర్, తిరుపతి, అశోక్, శేఖర్, విజయ్, సంపత్, శంకర్, రవి, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్ సతీష్, లక్ష్మణ్, మల్లేశం, మనోహర్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీం ఏర్పాటు : వీసీ

గణేశ్‌నగర్,మే 20: శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీంను మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ తెలిపారు. యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సూరపల్లి సుజాత- 9849468281,టెక్నికల్ అసిస్టెన్స్‌గా మార్క సంతోష్‌కుమార్-9030402257, గొల్లె మారుతి-9866625885, సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రవీణ్‌లను నియమించారు. యూనివర్సిటీకి సంబంధించి దోస్త్ సేవలకు టీం పనిచేస్తుందని వీసీ తెలిపారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 125క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించారు.

ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు

● కాలిబూడిదైన రెండు లక్షల నగదు, ఆభరణాలు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటల్లో రెండు లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ఊర కొండయ్య కుటుంబం ఒకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం నిత్యావసర సరుకులను తీసుకురావడం కోసం ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లారు. ఇంట్లో మంటల చెలరేగి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే తాళం పగులకొట్టి లీకేజీ అయి ఉన్న గ్యాస్ సిలెండర్‌ను బయటకు విసిరేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. అప్పటికే ఇంట్లో ఉన్న మంచాలు బీరువా ఇతర సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉన్న రెండు లక్షల నగదుతో పాటు వెండి బంగారు నగలు కూడా మంటల్లో కాలిపోయాయి. సంఘటన స్థలానికి కరీంనగర్ నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి యాభై కిలోల బియ్యం తదితర నిత్యావసర సరుకులను బట్టలను అందించారు. కాగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలి భాదిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజయ్య తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.


కాలిపోయిన నోట్లను పరిశీలిస్తున్న భాదితుడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, మే 20: పట్టణంలో 11కేవీ విద్యుత్తు లైన్లు, సబ్ స్టేషన్ల మరమత్తుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, రంగంపల్లి, బండల్లా, రామచంద్ర మిషన్, భూమ్ నగర్, టీచర్స్ కాలనీ, కూనారం రోడ్డు, వ్యవసాయ మార్కెట్, తదితర ప్రాంతాలలో 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మే20: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 2024-25 సంవత్సరానికి గాను 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు జూన్6లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మొత్తం ఐదు సీట్లు కేటాయించామన్నారు. మూడవ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదవ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8 వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించామన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలన్నారు. దరఖాస్తులను జూన్ 6 లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. జూన్ 12న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9652118867లో సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

అక్రమ వెంచర్‌లో హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

పెద్దపల్లి రూరల్, మే 20: మండలంలోని గౌరెడ్డిపేటలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో హద్దురాళ్లను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయొద్దని, తప్పనిసరిగా అనుమతులు తీసుకొని వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సహాయం అందించిన ఆటోడ్రైవర్లు

కాల్వశ్రీరాంపూర్, మే 20: మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన కుంట దీపక్ ఆరోగ్యం బాగాలేక కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ నాయకులు సోమవారం బాధితునికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8000 ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, మేకల కుమార్, అశోక్, అల్లెపు శంకర్, చంద్రమౌళి, రమేష్, రాజు, నరేష్ ఉన్నారు.

ఉత్సవాలు సంస్కృతికి ప్రతీక

-ఎమ్మెల్యే విజయరమణారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, మే 20 : గ్రామాల్లో ఉత్సవాలు, వేడుకలు సంస్కృతికి ప్రతీక అని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కనగర్తిలో సోమవారం గొల్ల, కుర్మలకు ఆరాధ్య దైవమైన బీరన్న కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోమవారం వేడుకలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, గ్రామాల్లో పచ్చటి పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని బీరన్న వద్ద వేడుకున్నారు. గతంలో బీరన్న ఆలయం వద్ద మట్టిని తరలించి నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. అనంతరం కుర్మలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుంటి చేరాలు, చొప్పరి రాజయ్య, ఉడిగె సదయ్య, కోట సత్యనారాయణ రెడ్డి, మొగిలి సంపత్, మొగిలి చేరాలు, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, తోట కొమురయ్య, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఓదెల, మే 20: ఏపీలోని తిరుమల తిరుపతి జిల్లా వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేసిన నిందితులను శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు కాసర్ల చిన్న ఐలయ్య గౌడ్, గాజుల శివశంకర్ డిమాండ్ చేశారు. వెంకటగిరిలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేయడం మతోన్మాదుల చర్య అని, రాజ్యాం గాన్ని నాశనం చేయాలని ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మున్సిపల్ చౌరస్తాలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కందుల సంధ్యారాణి

కోల్‌సిటీ, మే 20: రద్దీగా ఉండే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ చౌరస్తాలో ప్రజలు రోడ్డు దాటడానికి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజల జీవితాలకు తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తుందని, ఈ ప్రాంతంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌ను కమిషనర్‌ను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రద్దీ సమయాల్లో కళాశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక వైపు జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీలు మరోవైపు సరస్వతి శిశు మందిర్, డిగ్రీ పీజీ కాలేజీ మరియు మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రమాదాలను తగ్గించడమే కాకుండా ట్రాఫిక్ అంతరాయలను తగ్గుతాయన్నారు. విద్యార్థుల భద్రత, ప్రజల శ్రేయస్సును కోసం ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వచ్చే బడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షులు కోడూరి రమేష్, నాయకులు మిట్టపల్లి సతీష్, గోపగోని నవీన్ గౌడ్, కొమ్ము గట్టయ్య, బానాల స్వామి, మామిడాల శ్రీనివాస్, పిడుగు క్రిష్ణ, కొమళ్ల మహేష్, కొండపర్తి సంజీవ్, సుల్వ పద్మ, అపర్ణ, మచ్చ విశ్వాస్, పైతరి రాజు, తిరుపతి సత్యం, రాజుకుమార్ చారి, దాసరి శ్రీనివాస్, కుర్రె రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు లేకుంటే అంతే సంగతి

- 200 యూనిట్ల లోపు వినియోగించిన వారికే జీరో బిల్

- అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెద్దపల్లి రూరల్, మే 20: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకంతో సామాన్యులకు ప్రయోజనం చేకూరుతున్న అవగాహన లేకపోవడంతో లబ్ధిదారులు పథకానికి అనర్హులవుతున్నారు. విద్యుత్ వినియోగదారులు విచ్చలవిడిగా వాడటంతో 200 యూనిట్లు మించి వినియోగించడంతో బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవి కాలంలో అన్ని వర్గాల వారు విద్యుత్ వినియోగం కొంతమేర పెరిగే అవకాశం ఉన్నందున ఉచిత విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తేనే పథకం వర్తించే పరిస్థితి నెలకొంది.ఉచిత విద్యుత్ బిల్లు పథకం వర్తింప జేస్తున్నప్పటి నుండి విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో సుమారు 4,600 వరకు గృహ జ్యోతి లబ్ధిదారులు ఉన్నారని అధికారులు పేర్కొంటున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగాన్ని 200 యూనిట్ల లోపు తగ్గించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


బొంపల్లిలో జీరో విద్యుత్ బిల్ అందిస్తున్న అధికారులు(ఫైల్)

● అవసరాలకు అనుగుణంగా వినియోగించాలి

పరిమితంగా విద్యుత్‌ను వినియోగిస్తే పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుంది. అందుకు ఎల్ఈడీ బల్బులు, ఐఎస్ఐ మార్కు, స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలను వినియోగించడంతో పాటు అవసరం మేరకు విద్యుత్ వినియోగిస్తే విద్యుత్‌ను ఆదా చేయొచ్చు. దీంతో వ్యక్తిగతంగా ఆదా చేయడంతో పాటు ఆర్థికంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. కొంతమంది అవగాహన లేక విద్యుత్‌ను ఇష్టానుసారంగా వినియోగించడంతో గృహజ్యోతికి అనర్హులవుతుండగా మరికొంత మంది సాంకేతిక కారణాలతో లబ్ధిపొందలేకపోతున్నారు.

● ఫైవ్ స్టార్ రేటింగ్ ఎలక్ట్రానిక్ పరికరాలు

కంప్యూటర్‌లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు అవసరం లేనప్పుడు ఆఫ్ చేయాలి. ప్రస్తుత కాలంలో వాషింగ్ మిషన్, టీవీలు, ఫ్రిజ్‌లు వినియోగిస్తున్నారు. అవి ఐఎస్ఐ గుర్తింపుతో పాటు ఫైవ్ స్టార్ రేటింగ్ ఉన్న వాటినే కొనుగోలు చేసి వినియోగించాలి. ఫ్యాన్‌లు, ఎల్ఈడి బల్బులు సైతం ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ వాటినే వినియోగించాలి. ఇలా ఉన్నవాటిని వినియోగిస్తే విద్యుత్ ఆదా చేయొచ్చు.

● లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

- దామ సదయ్య, బీఆర్ఎస్ నాయకుడు, అందుగులపల్లి



గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు విద్యుత్ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించాలి. 200యూనిట్లు ఉచిత విద్యుత్ అనే సరికి ఇళ్లల్లో విద్యుత్ పరికరాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. అర్హులుగా ఉండాలంటే వినియోగించే పరికరాలపై అధికారులు అవగాహన కల్పించాలి.

● మరో విడత గుర్తించాలి ..

- కల్లెపల్లి అశోక్, సీపీఎం నాయకులు, రాఘవపూర్



ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద కొంతమంది లబ్ధిదారులను మాత్రమే గుర్తించారు. మరో విడతలో దరఖాస్తులను స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు పథకం అమలయ్యేలా అధికారులు దృష్టిసారించాలి. అసలైన లబ్ధిదారులకు పథకం అమలు కావడం లేదు.

● విద్యుత్‌ను ఆదా చేయాలి

- రవిచందర్, విద్యుత్ శాఖ వెస్ట్ ఏఈ, పెద్దపల్లి



విద్యుత్‌ను ఆదా చేస్తే పొదుపు చేసినట్లు అవుతుంది. ఎల్ఈడీ బల్బులు వినియోగిస్తూ 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించుకునేలా చూసుకోవాలి. విద్యుత్ వాడకంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వం అందించే గృహజ్యోతి పథకానికి లబ్ధిపొందాలి. అందుకు ప్రజలకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపడుతున్నాం.

తహసీల్దార్ ఆఫీసు ఆవరణలో పరుచుకున్న పచ్చదనం

- సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్న చెట్లు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న పచ్చని చెట్లు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పచ్చదనంతో నిండి ఉండి ప్రజలకు అధికారులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. ఈ వేసవి భరించలేని ఎండలకు సైతం ఇక్కడ ఎంతో మందికి నీడనిస్తోంది. అవసరార్థమై వచ్చే ప్రజలకు ఈ కార్యాలయ ఆవరణలోని భారీ వృక్షాలు అక్కున చేర్చుకుని నీడనిచ్చాయి. దారి వెంట వెళ్లే వారు కూడా ఈ చల్లని వాతావరణంలో కొంతసేపు గడుపుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో మినీ కలెక్టరేట్‌గా పేరు గాంచిన ప్రభుత్వ కార్యాలయాల సముదా యంలో తహసీల్దార్ కార్యాలయమే పెద్దది. దాంతో పాటు ఇదే ఆవరణలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, సబ్ ట్రెజరీ ఆఫీసు, అబ్కారీ శాఖ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. గతంలో ముకుంద రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆనాటి రోడ్డు భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డి ఈ మినీ కలెక్టరేట్‌ను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా అప్పటి తహసీల్దార్ రజిత ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వాటిని సంరక్షించారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు కూడా మొక్కల సంరక్షణ చర్యలు తీసుకున్నారు. దాంతో కార్యాలయం అవరణలో పచ్చని చెట్లు, అందమైన పూల మొక్కలు ఇతర మొక్కలు ఏపు గా పెరిగాయి. అలా ఈ కార్యాలయంలో పచ్చదనం పరుచుకుని అధికారులకు, ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తోంది. ముఖ్యంగా తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తమ పని అయ్యే వరకు ఈ చెట్ల కిందనే సేద తీరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ముత్తారం, మే 20: ముత్తారం మండలం సీతంపేట గ్రామానికి చెందిన మోతే జక్కయ్య గేదె విద్యుత్ షాక్ తో అక్కడిక్కడే మృతి చెందింది.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గేదె మేతకు వెళ్ళి మేస్తుండగా ఒక్కసారిగా 11 కేవి తీగ గేదెకు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది.గేదె విలువ సుమారు 40 వేల రూపాయలు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు.

రైలు ఢీకొని వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్, మే 20: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగ పనిచేస్తున్న బిహార్‌కు చెందిన చాంద్ దేవ్‌కార్‌వార్(35) ఆదివారం రాత్రి రైలు ఢీకొని మృతి చెందాడు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్‌లో టాటా కంపెనీలో పనిచేస్తున్న చాంద్‌దేవ్ ఫోన్లో మాట్లాడుతూ రాయల్ ట్రాక్ పైకి ఎక్కడంతో వెనుక నుంచి ఎన్టీపీసీ ప్రాజెక్ట్‌కు బొగ్గుతో వస్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

పెద్దపల్లిటౌన్, మే 20: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కె నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1 వ, 2 వ, 4 వ, వ స్థాయి సంఘం సమావేశం జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అధ్యక్షతన, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 3 వ, 5 వ, స్థాయి కమిటీ సమావేశం సంబంధిత స్థాయి సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు గౌరవసభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాల్సిందిగా కోరారు. సమావేశానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే నేరమా?

- పౌర హక్కుల సంఘం నాయకుడు నార వినోద్

పాలకుర్తి, మే 20: మండలం పరిధిలోని వేంనూర్ గ్రామంలో నల్లపు భీమవ్వ సంతాప సభ సోమవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు నార వినోద్ హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే నేరమా అని అన్నారు. గ్రామానికి చెందిన భీమవ్వ ప్రథమ సంతానమైన నల్లపు మల్లేష్ అలియాస్ రామన్న పేద ప్రజల కోసం నాటి (సీపీఐఎంఎల్) పీపుల్స్‌వార్, నేటి మావోయిస్టు పార్టీలో 1984లో చేరారన్నారు. 1992లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యుడిగా నియామకం అయ్యారన్నారు. వీణవంక మండలం అచ్చంపల్లి గ్రామంలో ఒక ఇంటిలో ఆశ్రయం పొంది ఉండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో రామన్న తన దళంతో పాటు అసువులు బాసాడన్నారు. పేద ప్రజల విముక్తి కోసం రామన్న అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామిళ్ల బాబు, బోడకుంటి సత్తయ్యగాలి ఆగయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కోల జనార్దన్, రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లయ్య, కార్యదర్శి ఎరుకల రాజయ్య, పౌరహక్కుల సంఘం సభ్యుడి బి లక్ష్మణ్, బీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూర్తి భాస్కర్, యాదవ హక్కుల పోరాట సమితి ఏ పద్మ, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జగిత్యాల జిల్లా బాధ్యుడు పొన్నం రాజమల్లయ్య, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

పాలకుర్తి, మే 20: మండలం పరిధిలోని వేమునూర్ గ్రామ శివారు ప్రాంతంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రాములు అతని భార్య రాంబాయి కుక్కలగూడూర్ నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రాములకు, అతడి భార్యకు, మరో ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పెద్దపల్లిలో బీజేపీ గెలుపు ఖాయం

- ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

పెద్దపల్లిటౌన్, మే 20: పెద్దపల్లి పార్లమెంటులో బీజేపీ గెలవడం ఖాయమని అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. రెండు నెలల బీజేపీ పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీకి రైతులు, మహిళలు, యువకులు, ఉద్యోగస్తులు ప్రతీ ఒక్కరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల సుపరిపాలనపై విశ్వాసంతో ఓటు వేశారన్నారు. 60 ఏళ్లలో పార్టీల పాలనలో లేని నీతివంతమైన, ధర్మబద్ధమైన పాలన మోదీ పాలనలో ప్రజలు చూశారన్నారు. సమర్థవంతమైన పాలన బలమైన నాయకత్వాన్ని ఈదేశానికి అందించారన్నారు. అలాగే దళిత వర్గానికి న్యాయం చేయడం కోసం ఉపకులాలకు మేలు చేసేలా కమిషన్ కూడా వేశారన్నారు. బడుగు బలహీన వర్గాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ద్వారా జరగని న్యాయం బీజేపీతోనే జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీకి అండగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలకు, మహిళలకు యువతకు రైతులకు, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపారు ఈ సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ వెంకటేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ ,పార్లమెంట్ కో కన్వీనర్ లక్ష్మణ్‌యాదవ్, తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, కౌన్సిలర్ రాజం, మహంత కృష్ణ, కారంగుల శ్రీనివాస్, పెంజర్ల రాకేష్, వేల్పుల రమేష్, కిరణ్, గుడ్ల సతీష్, పిట్ట వినయ్, పిట్ట భాస్కర్, కుమారస్వామి, హరీష్, మధుకర్, రాజేందర్, కరుణాకర్, సతీష్ పాల్గొన్నారు

న్యాయవాదుల మద్దతుకు కృతజ్ఞతలు..

కోల్‌సిటీ: పెద్దపల్లి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే బీజేపీ లీగల్ సెల్ న్యాయవాద బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గొమాసే

సోమవారం గోదావరిఖని రఘుపతిరావ్‌రావులోని బల్మూరి అమరేందర్ రావు ఇంట్లో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తన గెలుపు కోసం న్యాయవాదులు నల్లకోటు ధరించి లక్ష్మీనగర్‌లో డాక్టర్లని, వ్యాపారస్తులను కలిసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పేరుపేరునా ప్రతి ఒక్కరిని కోరారని, మేధావుల సమావేశం నిర్వహించి పార్లమెంటరీ స్థాయి న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చరర్స్, మేధావి వర్గంతో చర్చ గోష్టి సమావేశం నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎలక్షన్ ఇన్‌చార్జి మోహన్, సీనియర్ న్యాయవాది బల్మూరి అమరేందర్‌రావు, బల్మూరి వనిత, బీజేపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సిరిగ సంజయ్ కుమార్, లీగల్ సెల్ నాయకులు శంతన్ కుమార్, హిందు వాహిని జిల్లా అధ్యక్షులు రాగం శ్రీధర్, నాయకులు గుండెబోయిన లక్ష్మణ్ యాదవ్, కాసిపేట శివాజీ, సోమారపు లావణ్య, సోమరపు అరుణ్, న్యాయవాదులు, గుడి కందుల భూమయ్య, వెంకటేశం, ప్రవీణ్ కుమార్, కుడిది వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మే 20: మిషన్ లైఫ్‌స్టైల్ అమలులో భాగంగా సోమవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అనుసంధానంతో మిషన్ లైఫ్ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. శక్తిని కాపాడడం, నీటిని పొదుపు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, చెత్తను తగ్గించడం, ఈ-వేస్టేజీ తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవన శైలి అలవాటు చేసుకోవడం మిషన్ లైఫ్‌స్టైల్ లక్ష్యమని పేర్కొన్నారు. ఒక బిలియన్ భారతీయులను భాగస్వాములు చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాటిలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడు అంశాలతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను జీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధి శ్యాంసన్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు మధుసూదన్, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వరరావు, అధికారులు రవీందర్, రాజేంద్రప్రసాద్, ధనుంజయ, మురళీకృష్ణ, సురేష్‌బాబు, షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

అడ్రియాల ప్రాజెక్టు సందర్శించిన సేఫ్టీ జీఎం


ఏఎల్‌పీ సందర్శించిన సేఫ్టీ జీఎం గురువయ్య, అధికారులు

రామగిరి, మే 20: సింగరేణి సంస్థ కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అడ్రియాల ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. లాంగ్‌వాల్‌లోని పనిస్థలాలను పరిశీలించారు. అనంతరం లాంగ్‌వాల్‌లో బోల్టర్ మైనింగ్ పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 3 సీమ్ పంచ్ ఎంట్రీ పనులను పరిశీలించి భద్రతపరమైన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహా, సూచనలు చేశారు. అనుక్షణం భద్రతతో కూడిన ఉత్పత్తికే సింగరేణి ప్రాధాన్యం కల్పిస్తుందని అందుకు అనుగుణమైన చర్యలు తీసుకొవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రిజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు సీతారామం, సత్యనారయణ, సీహెచ్ వెంకటరమణ, రాజేందర్, రఘురాం, జనార్దన్ పాల్గొన్నారు.

ఓసీపీ-5లో ప్రమాదం: ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

గోదావరిఖని, మే 20: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ-5లో సోమవారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ఓ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రెండవ షిఫ్టులో క్వారీ నుంచి బొగ్గు తీసుకువస్తున్న డంపర్ డంప్ యార్డులో బొగ్గును అన్‌లోడ్ చేస్తుండగా మరో డంపర్ వచ్చి ఢీకొనడంతో ఆపరేటర్ రాగి దేవేంద్రచారికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రిటైర్డు కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

బెల్లంపల్లి, మే 20: సింగరేణి వ్యాప్తంగా గ్రాట్యూటీ చెల్లింపులో అన్యాయానికి గురైన రిటైర్డు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల ఏరియర్స్ వెంటనే చెల్లించాలని టీఎస్ టీయూసీ ప్రధానకార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. సింగరేణిలో 2016నుంచి 2018మధ్య కాలంలో రిటైర్ అయిన కార్మికులకు పెరిగిన గ్రాట్యూటీని చెల్లించలేదని దీని వల్ల సుమారు 3816మంది కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. వీరికి దాదాపు ఒక్కొక్కరికి రూ.10లక్షల వరకు సింగరేణి యాజమాన్యం చెల్లించాల్సి ఉందని, వీటిని వెంటనే చెల్లించాలని కోరారు.సమావేశంలో నాయకులు గద్దెల నారాయణ, చంద్రమౌళి, వెంకటస్వామి, పాషా, జీవరత్నం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకమైన పనిముట్లతో ఇబ్బందులు

శ్రీరాంపూర్, మే 20: నాసిరకమైన పనిముట్లు ఇచ్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్‌కె న్యూటెక్ గనిపై సోమవారం కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, డ్రిల్‌రాడ్స్, డ్రిల్‌బిట్స్ కొరత ఉందన్నారు. సర్వేఆఫ్ అయినా ఎస్‌డీఎల్ యంత్రాలు నడపడం వల్ల ఆపరేటర్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల్లో నాసిరకం ఆయిల్ వాడడం వల్ల యంత్రాలు పాడైపోతున్నా యన్నారు. అనంతరం మేనేజర్‌తో కలిసి సమస్యల గురించి చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు బాజీసైదా పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ సంపత్, పిట్‌కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయ కులు గజ్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.